అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 313 | వరంగల్ | శనివారం, 19 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07





సుమారు 1500మంది కార్మికుల వేతనాలు కట్!

- ప్రతీ నెల లక్షల్లో అక్రమార్జన
- "సర్వీస్ ఛార్జీల" నెపంతో భారీగా కోత
- పీఎఫ్, ఈఎస్ఐ నిధులూ హాంఫట్
- నగరంలోని ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాకం
- కార్మికుల శ్రమ దోపిడీతో అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తిన నిర్వాహకులు
- ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల ప్రోత్సాహంపైనా అనుమానాలు

4

వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని శ్రమ దోపిడీకి పాల్పడుతోంది. వేతనాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) కోసం నగదు కట్ చేస్తూనే.. ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయకుండా నిధులను దిగమింగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం పూర్తి వేతనాన్ని ఇవ్వకుండా "సర్వీస్ ఛార్జీల" నెపంతో ఒక్కో కార్మికుడి నుంచి 15% నుండి 20% వరకు కమీషన్లను దండుకుంటున్నట్లు తెలుస్తోంది. సదరు ఏజెన్సీ కింద సుమారు 1500 మంది లేబర్ పనిచేస్తుండగా.. వారిలో ఒక్కొక్కరి వేతనం నుంచి ప్రతి నెలా రూ. 3వేల వరకు కట్ చేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టప్రకారం 8 గంటలు పని చేయించాల్సి ఉండగా, గార్డులతో ఎలాంటి అదనపు వేతనం ఇవ్వకుండా 12 నుండి 16 గంటల వరకు బలవంతంగా పనిచేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు లేదా అనారోగ్య సెలవులు ఇవ్వకుండా కార్మికులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నట్లు సమాచారం. కార్మికుల శ్రమ దోపిడీతో సదరు ఏజెన్సీ నిర్వాహకులు అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. – *అక్షరశక్తి, వరంగల్*

ఒక్కొక్కరి నుండి రూ.3వేలు!

నిబంధనలకు ‘విరామం’!

- వీరభద్రుడి ఆలయంలో 20 ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగి విధులు ఎలా?
- మూడు ప్రమోషన్లపై భక్తుల్లో అనుమానాలు
- 11 రోజుల్లోనే ఈఓ బదిలీ రద్దు ఎందుకు?
- పాత సంప్రదాయాలు కనుమరుగవుతు న్నాయంటున్న భక్తులు
- ఆలయ పాలనపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్



6



వ్యక్తిత్వమే భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- విద్యార్థులకు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్‌కుమార్ సూచన
- ఘనంగా నిట్ వరంగల్ 24వ స్నాతకోత్సవం
- తొలిరోజు 952 మంది విద్యార్థులకు పట్టాల అందజేత



3



ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అక్షరశక్తి, హనుమకొండ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, అర్చన, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భజన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీమతి ఆకుల అనిత-సురేందర్ దంపతుల దాతృత్వంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గందే కృష్ణ, కనుకుంట్ల రవికుమార్, గంద్ర తి. సుధాకర్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ గౌడ్ కుటుంబానికి పరామర్శ



అక్షరశక్తి,హనుమకొండ: ప్రముఖ విద్యావేత్త, రాజకీయ నాయకుడు ఊడుగుల సత్యనారాయణ గౌడ్ మృతి తీరని లోటని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హంటర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఐదో రోజు దినకర్మకు హాజరైన ఆయన మిత్రులతో కలిసి సత్యనారాయణ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులు శ్రీను, వివేక్, వేణు, శ్రవణ్‌లను పరామర్శించారు. సత్యనారాయణ గౌడ్ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి సుమారు 40 ఏళ్ల క్రితం హనుమకొండ బాలసముద్రంలో లిటిల్ స్టార్ పబ్లిక్ స్కూల్‌ను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు సేవలందించారని పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా, తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ రాష్ట్రస్థాయి నాయకుడిగా పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్, గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్ సంస్థలో సేవలందించడంతో పాటు నర్సంపేట నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేశారని తెలిపారు. ఆయన తమ్ముడు వేణు ఊడుగుల ప్రముఖ దర్శకుడు, నిర్మాతగా రాణిస్తున్నారని, సత్యనారాయణ గౌడ్, సరోజన దంపతులకు చైతన్య, గౌతమ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. సత్యనారాయణ గౌడ్ మృతి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు తీరని లోటని అన్నారు.

కొత్తవాడలో మహా అన్నదానం

అక్షరశక్తి, వరంగల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తవాడ పాత కూరగాయల మార్కెట్ వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బస్వ రాజు కుమారస్వామి, 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్య నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణపతి నవరాత్రుల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు అన్నారు. యువత మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.



పర్యాటక దినోత్సవ కార్యక్రమాలకు పటిష్ట కార్యాచరణ

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



అక్షరశక్తి, హనుమకొండ: ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో పర్యాటక శాఖ వివిధ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 27న నిర్వహించే ప్రపంచ దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణపై పర్యాటక, విద్యా, పురావస్తు, అటవీ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... చారిత్రక ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. యువ టూరిజం క్లబ్ లో నమోదయి ఉన్న విద్యార్థులకు పర్యాటక, వారసత్వ సంపద పై మండల, జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓ,డిఐఈఓలకు సూచించారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6:00 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాలు, 25వ తేదీన హనుమకొండ పద్మాక్షి జైన దేవాలయం, సిద్ధేశ్వరాలయం వద్ద హెరిటేజ్ వాక్ ను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్ లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, యువత, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు. 26వ తేదీన ఉదయం 7 గంటలకు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టే కార్యక్రమాలను ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహా రావు, అడిషనల్ డీఆర్డీఏ వెంకటేశ్వర్లు, జీడబ్ల్యూఎంసి సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, డీఐఈవో గోపాల్, కేంద్ర పురావస్తు అధికారి అజిత్ కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ తుది ఓటర్ల జాబితా విడుదల



అక్షరశక్తి,హనుమకొండ: రెడ్ క్రాస్ సొసైటీ తుది ఓటర్ల జాబితా విడుదల హనుమకొండ, సెప్టెంబర్ 19: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా ఎన్నికల ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి. నవీన్ కుమార్ శనివారం విడుదల చేశారు. తుది జాబితాలో మొత్తం 9,896 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, 26న ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు.

తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 20 నుంచి రూ.2,000 చెల్లించి పొందవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 23 నుంచి నామినేషన్ పత్రాలు రెడ్ క్రాస్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, ప్రతి అభ్యర్థికి గరిష్ఠంగా రెండు నామినేషన్లు మాత్రమే ఆమోదిస్తామని చెప్పారు. నామినేషన్‌తో పాటు రూ.10,000 నాన్‌రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు, కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నట్లు బి. నవీన్ కుమార్ తెలిపారు.

గురుకులాల్లో కిరాణా టెండర్ రద్దు చేయాలి

- NACOFకు ఇచ్చిన టెండర్‌పై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ అభ్యంతరం



అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణ గురుకులాల్లో కిరాణా సరుకుల సరఫరా కోసం NACOF సంస్థకు ఇచ్చిన రాష్ట్రస్థాయి టెండర్‌ను రద్దు చేయాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ డిమాండ్ చేసింది. హనుమకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ ఈ డిమాండ్ చేశారు. గతంలో చిన్న పరిశ్రమలు సరఫరా చేసిన ధరలతో పోలిస్తే NACOFకు 20-30 శాతం అధిక ధరలు కేటాయించారని ఆరోపించారు. ఉదాహరణకు కిలో శనగపప్పు రూ.125 నుంచి రూ.148కు, శనగపిండి రూ.70 నుంచి రూ.120కు, గోధుమపిండి రూ.50 నుంచి రూ.66కు పెరిగినట్లు వివరించారు. బ్రాండెడ్ ఉత్పత్తుల స్థానంలో కొన్ని సరుకులను బ్రాండ్ వివరాలు లేకుండా సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఎక్కువగా వినియోగించే సరుకులకు పేపర్ రేటుపై 10 శాతం తక్కువగా ధర నిర్ణయించే విధానంలో అవకతవకలకు అవకాశం ఉందని ఆరోపించారు.

అధిక ధరల కారణంగా గురుకుల విద్యార్థులకు కేటాయించిన బడ్జెట్ సరిపోక గుడ్లు, పండ్లు, చికెన్, మటన్ వంటి పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందకపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. NACOFకు ఇచ్చిన టెండర్‌ను రద్దు చేసి గతంలో మాదిరిగా డీపీసీ పరిధిలో ప్రొవిజన్స్ టెండర్ నిర్వహించాలని కోరారు. NACOF సంస్థ బ్లాక్‌లిస్టులో ఉందని, టెండర్‌కు అర్హత లేదని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.

వ్యక్తిత్వమే భవిష్యత్తును నిర్ణయిస్తుంది

విద్యార్థులకు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్‌కుమార్ సూచన

ఘనంగా నిట్ వరంగల్ 24వ స్నాతకోత్సవం

తొలిరోజు 952 మంది విద్యార్థులకు పట్టాల అందజేత





అక్షరశక్తి, కాజీపేట, సెప్టెంబరు 19: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ 24వ స్నాతకోత్సవం శనివారం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. తొలిరోజు 930 మంది అండర్‌గ్రాడ్యుయేట్, 22 మంది ఎగ్జిట్ డిగ్రీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఆదివారం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా, ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ డా. బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి గౌరవ అతిథిగా, డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుది హాజరయ్యారు.

విద్యార్థులు జ్ఞానంతో పాటు విలువలను ఆచరించాలని డైరెక్టర్ బిద్యాధర్ సుబుది సూచించారు. సంస్థలో క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ, ఎలక్ట్రిక్ వెహికల్స్, మెటీరియల్స్ సైన్స్ తదితర రంగాల్లో కొత్త కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. 2025-26లో 1,771 పరిశోధనా వ్యాసాలు, 617 కాన్ఫరెన్స్ పేపర్లు, 123 పుస్తక అధ్యాయాలు ప్రచురితమయ్యాయని, 36 పేటెంట్లు మంజూరయ్యాయని చెప్పారు. సుమారు రూ.900 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల్లో 93.94 శాతం, పీజీ విద్యార్థుల్లో 80.78 శాతం మందికి ప్లేస్‌మెంట్లు లభించాయని తెలిపారు. అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సగటు వేతనం రూ.18.54 లక్షలు, అత్యధిక దేశీయ ప్యాకేజీ రూ.1.27 కోట్లుగా నమోదైందన్నారు.

'ఏఐ యుగంలో ఇంజనీర్ పాత్ర మరింత కీలకం' అని డా. బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు విలువలు, విశ్వసనీయత, వైఫల్యాలను స్వీకరించే ధోరణి అవసరమన్నారు. 'వ్యక్తిత్వమే విధి' అని ముఖ్య అతిథి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. డిగ్రీలు, సాంకేతిక నైపుణ్యాలు కెరీర్‌కు అవసరమైనవేనని, నిజాయితీ, విశ్వసనీయత, ఇతరులతో వ్యవహరించే తీరు వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయని చెప్పారు. వైఫల్యాల నుంచి నేర్చుకుని నిరంతరం మెరుగుపడాలని సూచించారు. సాంకేతికతను సమాజంలోని వాస్తవ సమస్యల పరిష్కారానికి వినియోగించాలని కోరారు.

సిద్ధి బార్పుటేకు డైరెక్టర్ గోల్డ్ మెడల్

అండర్‌గ్రాడ్యుయేట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిద్ధి బార్పుటేకు డైరెక్టర్ గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. వివిధ బీటెక్ విభాగాల్లో రోల్ ఆఫ్ ఆనర్ గోల్డ్ మెడల్స్ అందుకున్నవారు: ప్రియాంశు కుమార్ సింగ్ (సివిల్), నాలజాల జోషిత్ (ఈఈఈ), వలుస రఘువరన్ (మెకానికల్), దొండపాటి లోకేశ్వర్ (ఈసీఈ), మదగాని సాత్విక్ (మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్), సిద్ధి బార్పుటే (కెమికల్), జయంతి అన్షు (సీఎస్ఈ), అమన్ అబ్దుల్సమద్ ఇనాఢూర్ (బయోటెక్నాలజీ). మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని బుద్ద జేష్ణంతి రూపొందించిన ప్రాజెక్టుకు బెస్ట్ బీటెక్ ప్రాజెక్ట్ అవార్డు లభించింది.

ఇద్దరికి గౌరవ డిగ్రీలు

ఏవియేషన్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో సేవలకు డా. పి.కె. మేనన్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్ గౌరవ డిగ్రీ, సెమీ కండక్టర్ రంగానికి చేసిన కృషికి మైక్రాన్ ఇండియా ఎండీ ఆనంద్ రామమూర్తికి గౌరవ పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఆదివారం పీజీ, పీహెచ్‌డీ డిగ్రీలతో పాటు ఉత్తమ థీసిస్, డిసర్టేషన్, రోల్ ఆఫ్ ఆనర్ అవార్డులు అందజేయనున్నారు.

నిజాం చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- **భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సూచన**



అక్షరశక్తి, మహబూబాబాద్, సెప్టెంబరు 19: గణేష్ నిమజ్జనానికి సంబంధించి నిజాం చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పరిశీలించారు. అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, బారికేడింగ్, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజలు మున్సిపల్, పోలీసు అధికారుల సూచనలు పాటించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుర్ణపు సోమయ్య, కమిషనర్ వినోద్‌కుమార్, డీఎస్పీ తిరుపతి, సీఐ అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. పేపర్ కవర్లే ముద్దు

ఆదర్శ్ హైస్కూల్‌లో మార్కెట్ డే



అక్షరశక్తి, హన్మకొండ: ఎక్సైజ్ కాలనీలోని ఆదర్శ్ హైస్కూల్‌లో శనివారం మార్కెట్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థులను సమీపంలోని మార్కెట్‌కు తీసుకెళ్లి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, పర్యావరణంపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించారు. రోజువారీ అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్ కవర్లు, ఇతర పునర్వినియోగ సంచులను ఉపయోగించాలని విద్యార్థులు ప్రజలకు సూచించారు. విద్యార్థులు చేతుల్లో పేపర్ కవర్లను ప్రదర్శిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, జంతువులు, మనుషులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు సమయంలో ప్లాస్టిక్ కవర్లను తిరస్కరించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలను కోరారు. మార్కెట్ డే ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతోపాటు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యక్ష అవగాహన కలిగిందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీపాల్‌రెడ్డి, శివనాగేశ్వర్ రావు, నర్సింహారావు, ప్రిన్సిపాల్ ప్రసున్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లపై
అధికారుల పరిశీలన

అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచన



అక్షరశక్తి, గీసుగొండ: వినాయక నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కట్ట మల్లన్న చెరువు కట్ట, నిమజ్జన ప్రాంతాలను వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. తహసీల్దార్‌తో పాటు ఫిషరీస్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఎండోమెంట్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాలు, మౌలిక సదుపాయాలు, విద్యుత్, రహదారులు, చెరువు కట్ట భద్రత, నీటిలో భద్రత తదితర అంశాలను పరిశీలించారు. గుర్తించిన సమస్యలపై ఆయా శాఖలు తక్షణ చర్యలు చేపట్టి, నిమజ్జనం నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. చెరువులో పూడికతీత పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ప్రజలు, వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తోడ్పడాలని గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ కోరారు.

ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో వేడుకలు



అక్షరశక్తి, హనుమకొండ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు కోరారు. సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థి హక్కులు, ఉచిత, నాణ్యమైన విద్య, నిరుద్యోగ నిర్మూలన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహించిందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. వార్షికోత్సవాల సన్నాహక కమిటీ సమావేశం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏదునూరి వెంకట్రాజ్యం అధ్యక్షతన జరిగింది. పలువురు మాజీ నాయకులు, రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రెహమాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

గణపతి మండపంలో కూచిపూడి నృత్యాలు



అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబరు 19: నగరంలోని రంగసాయిపేట రుద్రమనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సిల్వర్ క్రౌన్ స్కూల్ విద్యార్థులు పసుపులేటి బిందుమతి శిష్యబృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేసి, బిందుమతిని శాలువాతో సత్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుపులేటి హనుమంతరావు, కర్ణ వేణుగోపాల్, కొంగరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రేపే ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత మాక్ టెస్ట్

డాక్టర్ పుల్లా శ్రీనివాస్



అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబరు 19: కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ సౌజన్యంతో, విష్ణు ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆదివారం ఉచిత మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకతీయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ భవనంలోని కౌన్సెలింగ్ హాల్‌లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మాక్ టెస్ట్ ద్వారా పరీక్షా విధానం, సమయపాలనపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థిపై దాడి చేసిన

ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు

- **విధుల నుంచి తొలగిస్తూ టిజిఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం**

అక్షరశక్తి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు సమీపంలో పాఠశాల విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, దాడికి పాల్పడిన తొర్రూరు డిపోకు చెందిన బస్సు (TS26T1266) డ్రైవర్ స్వామి (స్టాఫ్ నం. 2047)పై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) తీవ్రంగా స్పందించింది. డ్రైవర్ స్వామి ని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణలో డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు తేలడంతో తక్షణమే ఈ చర్యలు తీసుకున్నారు.

ప్రయాణికుల భద్రత, గౌరవానికే తొలి ప్రాధాన్యం:

ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధుల పట్ల మర్యాదగా ప్రవర్తించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపై ఉందని సంస్థ స్పష్టం చేసింది. బస్సుల్లో ప్రయాణించే వారి భద్రతకు, గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడే వారిని ఎంతమాత్రం సహించేది లేదని ఆర్టీసీ యాజమాన్యం ఈ సందర్భంగా హెచ్చరించింది. సిబ్బంది అందరూ ప్రయాణికులతో సౌమ్యంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని యాజమాన్యం స్పష్టం చేసింది.

భక్తిశ్రద్ధలతో కుమ పూజ



అక్షరశక్తి, హన్మకొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రేటర్ వరంగల్ పరిధి హంటర్‌రోడ్డు 31వ డివిజన్ దీన్ దయాళ్ నగర్లో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి మండపం వద్ద పూజారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుంకుమ పూజను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్థానిక మహిళలు జోరిక భవాని రమేష్, పున్నం మమత ప్రశాంత్, మేఘన, సంగీతలతో పాటు యూత్ సభ్యులు రవితేజ, సంతోష్, రాజు, సజ్జు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఒక్కొక్కరి నుండి రూ.3వేలు!

- సుమారు 1500మంది కార్మికుల వేతనాలు కట్ !
- ప్రతీ నెల లక్షల్లో అక్రమార్జన
- "సర్వీస్ ఛార్జీల" నెపంతో భారీగా కోత
- పీఎఫ్, ఈఎస్ఐ నిధులూ హాంఫట్
- నగరంలోని ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాకం
- కార్మికుల శ్రమ దోపిడీతో అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తిన నిర్వాహకులు
- ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల ప్రోత్సాహంపైనా అనుమానాలు



అక్షరశక్తి, వరంగల్ : వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని శ్రమ దోపిడీకి పాల్పడుతోంది. వేతనాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) కోసం నగదు కట్ చేస్తూనే.. ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయకుండా నిధులను దిగమింగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం పూర్తి వేతనాన్ని ఇవ్వకుండా "సర్వీస్ ఛార్జీల" నెపంతో ఒక్కో కార్మికుడి నుంచి 15% నుండి 20% వరకు కమీషన్లను దండుకుంటున్నట్లు తెలుస్తోంది. సదరు ఏజెన్సీ కింద సుమారు 1500 మంది లేబర్ పనిచేస్తుండగా.. వారిలో ఒక్కొక్కరి వేతనం నుంచి ప్రతి నెలా రూ. 3వేల వరకు కట్ చేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టప్రకారం 8 గంటలు పని చేయించాల్సి ఉండగా, గార్డులతో ఎలాంటి అదనపు వేతనం ఇవ్వకుండా 12 నుండి 16 గంటల వరకు బలవంతంగా పనిచేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు లేదా అనారోగ్య సెలవులు ఇవ్వకుండా కార్మికులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నట్లు సమాచారం. కార్మికుల శ్రమ దోపిడీతో సదరు ఏజెన్సీ నిర్వాహకులు అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ప్రైవేట్ దవాఖానలపై అనుమానాలు

వరంగల్ నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను ప్రోత్సహించడం వెనక కారణాలేంటనేది అంతుచిక్కడంలేదు. ప్రైవేట్ హాస్పిటల్ అంటే కేవలం వైద్యం అందించే ప్రదేశం మాత్రమే కాదు. అక్కడ పనిచేసే ప్రతి ఉద్యోగి ఆసుపత్రి సేవల్లో భాగమే. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లతో పాటు సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు, ఇతర సహాయక సిబ్బంది కూడా ఆసుపత్రి రోజువారీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తారు. అయితే హాస్పిటళ్లు సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ సిబ్బందిని నేరుగా తమ సంస్థ ఉద్యోగులుగా ఎందుకు నియమించుకోవడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. చాలా ప్రైవేట్ సంస్థలు సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ వంటి సేవలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తుండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆసుపత్రికి పాలనా బాధ్యతలు తగ్గడం, సిబ్బంది నిర్వహణ సులభం కావడం, షిఫ్ట్‌లను నిర్వహించుకోవడం వంటి ప్రయోజనాలు పొందుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న కార్మికుడి వేతనం, పని గంటలు, సెలవులు, భద్రత, సామాజిక భద్రత, ఉద్యోగ స్థిరత్వం వంటి అంశాలపై ఎవరి బాధ్యత ఎంత? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సొంత సెక్యూరిటీ ఎందుకు ఉండకూడదు?

రోగులకు వైద్యం అందించే ఆసుపత్రులు.. తమ గేటు వద్ద భద్రత కల్పించే కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వలేవా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్ సిబ్బంది సేవలు అత్యంత కీలకం. ఆసుపత్రి ప్రవేశ ద్వారం నుంచి రోగుల భద్రత వరకు, పరిశుభ్రత నుంచి ఆసుపత్రి నిర్వహణ వరకు వీరి శ్రమ ఎంతో అవసరం. అయితే, ఇంతటి కీలకమైన విధులు నిర్వహించే సిబ్బందిని ఆసుపత్రులు తమ సొంత ఉద్యోగులుగా నియమించుకోకుండా ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలకు కాంట్రాక్టులు అప్పగించడం వెనుక కారణాలేంటి? అనేది అంతుచిక్కడంలేదు. సిబ్బంది నియామకం, నిర్వహణ సౌలభ్యం కోసం ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారా? లేక ఉద్యోగులపై దీర్ఘకాలిక బాధ్యతలను తగ్గించుకోవడమే ప్రధాన ఉద్దేశమా? తెలియడంలేదు. ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇవ్వడం చట్టబద్ధమైనదే కావచ్చు. కానీ ఆ విధానం కార్మికుల హక్కులను బలిపెట్టే సాధనంగా మారకూడదని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

నేరుగా నియామకాలెందుకు చేపట్టరు..?

ఒక ఆసుపత్రికి రోజుకు 24 గంటలు సెక్యూరిటీ అవసరం. సిబ్బందిని నియమించడం, వారికి శిక్షణ ఇవ్వడం, షిఫ్టులు నిర్వహించడం, సెలవులు, ప్రత్యామ్నాయ సిబ్బంది ఏర్పాటు చేయడం వంటి బాధ్యతలు ఉంటాయి. ఈ నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడానికి ఆసుపత్రులు ఏజెన్సీలను ఆశ్రయించవచ్చు. కానీ ఆసుపత్రి సొంతంగా సెక్యూరిటీ విభాగాన్ని ఏర్పాటు చేసుకుని ఉద్యోగులను నియమించుకోవడం కూడా ఒక ప్రత్యామ్నాయం కాదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంస్థకు అవసరమైన భద్రతా సేవలను అందించే కార్మికులకు నేరుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తే, వారి ఉద్యోగ స్థిరత్వం, సంస్థతో అనుబంధం, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉండదా? అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఏజెన్సీల ద్వారానే సెక్యూరిటీ సేవలు పొందాలనే తప్పనిసరి నిబంధన లేనప్పుడు.. ఆసుపత్రులు నేరుగా నియామకాల విధానాన్ని ఎందుకు విస్తృతంగా పరిశీలించకూడదని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి భద్రత ఎంత ముఖ్యమో.. ఆ భద్రతను కల్పించే కార్మికుడి భవిష్యత్తు కూడా అంతే ముఖ్యం కదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలెక్కడ ?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రవేశస్థాయి భద్రతా గార్డులు, పర్యవేక్షకులకు నిర్దేశిత శిక్షణ ఉంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం సాధారణ గార్డులు/పర్యవేక్షకులకు కనీస శిక్షణ వ్యవధి 20 పని రోజులు. తరగతి బోధన 100 గంటలు, క్షేత్ర శిక్షణ 60 గంటలుగా పేర్కొనబడింది. మాజీ సైనికులు, మాజీ పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా తక్కువ వ్యవధి నిబంధన ఉంది. శిక్షణలో అత్యవసర పరిస్థితుల్లో స్పందన, ప్రథమ చికిత్స, అగ్నిప్రమాదాల సమయంలో చర్యలు, గుంపుల నియంత్రణ, భద్రతా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనీస శిక్షణ లేకుండానే ధ్రువపత్రాలు జారీచేయడం.. కేవలం పత్రాల్లోనే కార్మికులను చూపించడం.. తప్పుడు రికార్డులతో నగరంలోని కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలు ఇష్టారీతిన వ్యవహరిస్తుండటం గమనార్హం. సెక్యూరిటీ గార్డులను నియమించడం మాత్రమే సరిపోదని, వారిని పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పేరిణి వైభవాన్ని భావితరాలకు అందించాలి

- పేరిణి నాట్యాచార్యులు గజ్జల రంజిత్ కుమార్





అక్షరశక్తి,హనుమకొండ: తెలంగాణ ప్రాంత గొప్ప శాస్త్రీయ సంప్రదాయమైన పేరిణి నాట్య చరిత్ర, వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేరిణి నాట్యాచార్యులు గజ్జల నవ్యరాజా రంజిత్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమానికి చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఆయన హాజరై పేరిణి నాట్య విశిష్టతను వివరించారు. పేరిణిలో తాండవం, లాస్యం రెండూ కలిసి ఉంటాయని, తాండవం పురుష సంప్రదాయ నృత్యం కాగా, లాస్యం స్త్రీ సంప్రదాయ నృత్యమని తెలిపారు. పేరిణి నాట్యానికి కాకతీయుల కాలానికి ముందే సుదీర్ఘ చరిత్ర ఉందని, కాకతీయులు ఈ నృత్యాన్ని విశేషంగా పోషించారని రంజిత్ కుమార్ వివరించారు. కాకతీయుల కాలంలో గజసాహినిగా ఉన్న జాయపసేనాని ఆచార్య గుండమాత్మని వద్ద పేరిణి నాట్యాన్ని అభ్యసించారని, అనంతరం 'నృత్య రత్నావళి' గ్రంథాన్ని రచించారని తెలిపారు. రామప్ప, వేయి స్తంభాల దేవాలయాల్లో పేరిణి నాట్య భంగిమలు, నాటి కళా వైభవానికి సంబంధించిన శిల్పాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. పద్మశ్రీ నటరాజ రామకృష్ణ పేరిణి నాట్యాన్ని పునఃసృష్టి చేసి 1970లో ప్రదర్శనలకు తీసుకొచ్చారని తెలిపారు. పేరిణిలో వీరత్వం, గంభీరత, రౌద్రభావాలతో కూడిన రుద్రతాండవం ఉంటుందని, అంగ, ఉపాంగాలతో శివశక్తిని ఆహ్వానిస్తూ నృత్యం చేస్తారని వివరించారు. కాకతీయుల కాలంలో దేవాలయాల నిత్యకైంకర్యాల్లో భాగంగా పేరిణి నాట్యం ప్రదర్శించడంతో పాటు, యుద్ధానికి వెళ్లే వీరుల్లో ఉత్సాహం, స్ఫూర్తిని నింపేందుకు కూడా దీనిని ఉపయోగించేవారని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ, పుస్తకాలలో చదివిన పేరిణి నాట్యాన్ని ప్రత్యక్షంగా చూడడం సంతోషంగా ఉందని, కార్యక్రమాన్ని నిర్వహించిన చరిత్ర విభాగాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థినులు పేరిణి నాట్య భంగిమలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని, కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్లు అరుణ, ఉదయశ్రీ, జ్యోతిర్మయి, ఫిజిక్స్ అధ్యాపకురాలు అరుణ, చరిత్ర అధ్యాపకురాలు బి. జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనతోనే సామాజిక న్యాయం



అక్షరశక్తి, హనుమకొండ: సమగ్ర సామాజిక, ఆర్థిక ప్రాతిపదికతో చేపట్టే కులగణన భారత సమాజానికి ఎక్స్‌రేలా ఉపయోగపడుతుందని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ పేర్కొంది. దేశంలోని ధనిక వర్గాల వద్ద అధిక శాతం సంపద కేంద్రీకృతమై ఉండగా, దిగువ 50 శాతం ప్రజల వద్ద స్వల్ప సంపద మాత్రమే ఉందని తెలిపింది. ఈ ఆర్థిక అసమానతకు సామాజిక రూపం ఏమిటో తెలుసుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఇతర సామాజిక వర్గాల జనాభాతో పాటు వారి విద్య, ఉపాధి, ఆస్తులు, వ్యాపార యాజమాన్యం, అధికార వ్యవస్థల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలను కూడా కులగణనలో నమోదు చేయాలని కోరింది. తెలంగాణలో నిర్వహించిన సామాజికఆర్థిక సర్వేలో కులాల పేర్లను క్రమబద్ధీకరించి ప్రత్యేక కోడ్లతో నమోదు చేసి, వివిధ సూచికల ఆధారంగా విశ్లేషించిన విధానాన్ని ఫోరం ప్రస్తావించింది. కులగణనలో కులాల పేర్ల నమోదు పద్ధతిని కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని ఫోరం కోరింది. 2026 ఆగస్టు 14న ప్రకటించిన సెన్సెస్2027 షెడ్యూలులో ఎస్సీ, ఎస్టీలకు అధికారిక జాబితాల ఆధారంగా వర్గీకరణకు అవకాశం ఉండగా, ఓబీసీలు, ఇతర కులాల విషయంలో వ్యక్తులు పేర్కొన్న కులపేరును ఓపెన్ టెక్స్ట్‌గా నమోదు చేసే విధానం ఉందని తెలిపింది. 2011 సామాజిక, ఆర్థిక కుల సర్వేలో 46 లక్షలకు పైగా వేర్వేరు కులపేర్లు నమోదైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఒకే కులానికి ఉన్న ప్రాంతీయ, ఉపకుల, స్థానిక, సమానార్థక పేర్లను ఒకే కోడ్ కింద నమోదు చేయాలని సూచించింది. సామాజిక వర్గం, కులం రెండింటినీ విడిగా నమోదు చేసి, రాష్ట్రాల అధికారిక కుల జాబితాలను ప్రామాణికంగా తీసుకోవాలని, జాబితాలో లేని పేర్లకు మాత్రమే ఓపెన్ టెక్స్ట్ విధానాన్ని అనుమతించాలని పేర్కొంది. కులగణన కేవలం జనాభా సంఖ్యను లెక్కించే ప్రక్రియగా కాకుండా ప్రాతినిధ్యం, అవకాశాలు, అధికారంలో వాటా, సామాజికఆర్థిక స్థితిగతులను వెల్లడించే సమగ్ర ప్రక్రియగా ఉండాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ అభిప్రాయపడింది. ఓబీసీ రిజర్వేషన్లలో అంతర్గత అసమానతలను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన రోహిణి కమిషన్ నివేదికను కూడా ప్రజల ముందుకు తీసుకురావాలని కోరింది. సరైన పద్ధతిలో కులగణన జరిగితేనే విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, ప్రభుత్వ ప్రాతినిధ్యం, సంక్షేమం తదితర రంగాల్లో సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని, నమ్మదగిన గణాంకాల ఆధారంగా సామాజిక న్యాయం కోసం విధానాలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని ఫోరం పేర్కొంది.



నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

సూపరింటెండెంట్‌కు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల వినతి

అక్షరశక్తి, నర్సంపేట: నర్సంపేటలోని వరంగల్ జిల్లా మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని జిల్లా సమాచార కేంద్రం కమిటీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదరి బాయిని కలిసి కోరారు. ఆస్పత్రి వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ ఏర్పాటు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, రోగులకు అందించే ఆహారంలో అవకతవకలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన సూపరింటెండెంట్ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి రహదారి మరమ్మతులకు ఎమ్మెల్యే సహకారం తీసుకుంటామని, బస్‌స్టాప్ కోసం ఆర్టీసీ అధికారులకు దరఖాస్తు చేస్తామని తెలిపారు. ఆర్టీసీ డీఎం సరస్వతి కూడా ఆస్పత్రి సూపరింటెండెంట్ నుంచి లేఖ అందితే బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

మంత్రి పొంగులేటికి సీపీఐ వినతి




అక్షరశక్తి, హనుమకొండ: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న సుమారు వెయ్యి మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్లు 964, 966తో పాటు దీన్‌దయాల్‌నగర్, బంధం చెరువు, కోట చెరువు, ఇందిరమ్మ కాలనీల్లో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తదితరులు మంత్రిని కలిశారు. పట్టాలు ఇచ్చి, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సీపీఐ నాయకులు తెలిపారు.

సీతంపేట మాజీ సర్పంచ్ నడ్డునూరి చేరాలు మృతి



అక్షరశక్తి, హసన్‌పర్తి: సీతంపేట గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నడ్డునూరి చేరాలు శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ ప్రజలకు సేవలందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించేవారని స్థానికులు తెలిపారు. ఆయన మృతి సీతంపేట గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



నిబంధనలకు విరామం!

- **వీరభద్రుడి ఆలయంలో 20 ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగి విధులు ఎలా?**
- **మూడు ప్రమోషన్లపై భక్తుల్లో అనుమానాలు**
- **11 రోజుల్లోనే ఈఓ బదిలీ రద్దు ఎందుకు?**
- **పాత సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయంటున్న భక్తులు**
- **ఆలయ పాలనపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్**

అక్షరశక్తి, మహబూబాబాద్ : కురవి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు పాలనా వ్యవహారాలపైనా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిబ్బంది కొరత ఉందని చెబుతున్న సమయంలో కొందరు ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆలయ కార్యనిర్వహణ అధికారి బదిలీ జరిగిన కొద్ది రోజులకే నిర్ణయం మారడంపైనా భక్తుల్లో చర్చ జరుగుతోంది.

ఆలయంలో ఓ ఉద్యోగి సుమారు 20 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో మూడు ప్రమోషన్లు పొందడం ఎలా సాధ్యమైందనే ప్రశ్నలు భక్తుల నుంచి వస్తున్నాయి. బదిలీ నిబంధనలు ఏం చెబుతున్నాయి? సుదీర్ఘకాలం ఒకే చోట కొనసాగడానికి అనుమతి ఎవరు ఇచ్చారు? ప్రమోషన్ల సమయంలో నిబంధనలు పాటించారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు పరిశీలన చేయాలని కోరుతున్నారు.

11 రోజుల్లోనే ఈఓ బదిలీ రద్దు

ఆలయ కార్యనిర్వహణ అధికారిని బదిలీ చేసిన 11 రోజులకే తిరిగి అదే స్థానానికి బదిలీ చేయడంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత తక్కువ వ్యవధిలో బదిలీ నిర్ణయం ఎందుకు మారింది? పరిపాలనా అవసరాలా? ఇతర కారణాలా? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని భక్తులు అంటున్నారు. బదిలీలు, పోస్టింగులు, ప్రమోషన్ల వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని కోరుతున్నారు.

పాత సంప్రదాయాలు ఏమయ్యాయి?

ఆలయానికి సంబంధించి తరతరాలుగా కొనసాగుతున్న కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతానం కోసం మహిళలు మొక్కులు చెల్లించుకోవడం,



సంతానం కలిగిన అనంతరం ఊయలలు సమర్పించడం వంటి స్థానిక ఆచారాలు గతంలో కొనసాగేవని చెబుతున్నారు. అవి ఎందుకు నిలిచిపోయాయో, వాటి పరిరక్షణకు ఆలయ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టం చేయాలని కోరుతున్నారు.

భక్తుల రాత్రి బసకు అవకాశం ఏది?

గతంలో భక్తులు రాత్రివేళ ఆలయంలో బస చేస్తూ స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకునే సంప్రదాయం ఉండేదని స్థానికులు చెబుతున్నారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు, భద్రతా ప్రమాణాలకు లోబడి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నాగేంద్ర స్వామి ఆలయంపై దృష్టి ఏది?

ప్రధాన ఆలయ దక్షిణ భాగంలో ఉన్న నాగేంద్ర స్వామి ఆలయ అభివృద్ధిపైనా భక్తులు ప్రశ్నిస్తున్నారు. పూజా కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని అంటున్నారు.

శివాలయంలో పూజారి ఎక్కడ?

శ్రీ శివాలయంలో నవగ్రహాలు, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాలు ఉన్నప్పటికీ నిత్య పూజలు నిర్వహించేందుకు అవసరమైన పూజారి, సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయంలోని వివిధ ఉపాలయాల్లో పూజా కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయా? నైవేద్య విధానాలు నిబంధనల ప్రకారం అమలవుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

భద్రకాళి ఆలయానికి ప్రత్యేక పర్వాట్లు ఎప్పుడు?

భద్రకాళి అమ్మవారి ఆలయానికి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజారి నియామకం తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల అభివృద్ధికి కూడా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అంటున్నారు.

అభివృద్ధికి అడ్డంకి ఎవరు?


కోట్లాది రూపాయల నిధులు మంజూరవుతున్నా ఆలయ అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోవడానికి కారణాలేమిటన్నది తేలాల్సి ఉంది. నిధుల వినియోగం, ఆలయ ఆదాయ-వ్యయాలు, భూముల వివరాలు, ఆక్రమణల ఆరోపణలు, నిర్మాణాల నాణ్యత, సిబ్బంది బదిలీలు, పెండింగ్ పనులపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే.. ప్రతిపక్షం స్పందించాలి

ఆలయ భూముల పరిరక్షణ, భక్తులకు మౌలిక వసతులు, నిధుల వినియోగం, పాలనా వ్యవహారాలపై స్థానిక ఎమ్మెల్యే, ప్రధాన ప్రతిపక్ష నేతలు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయాలకు అతీతంగా పుణ్యక్షేత్ర అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

GUEST COLUMN

పెన్షన్‌కు పరీక్ష



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

వాస్తవానికి 2025 ఆర్థిక చట్టంలోని నాలుగో భాగం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పెన్షనర్ల మధ్య తేడాలు సృష్టించే అధికారాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ముఖ్యంగా కేంద్ర వేతన సంఘాల సిఫారసులను అమలు చేసే సందర్భంలో రిటైర్మెంట్ తేదీని పెన్షన్ వర్గీకరణకు ఆధారంగా చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. ఈ నిబంధనకు 1 జూన్ 1972 నుంచి వెనుకటి తేదీతో అమలును కల్పించడం మరో ముఖ్యమైన అంశం. 1972లోని కేంద్ర సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు, 2021 నిబంధనలు, 2023లోని అసాధారణ పెన్షన్ నిబంధనలకు సంబంధించిన చట్టపరమైన స్థితిని ఈ భాగం ధ్రువీకరిస్తోంది.

ప్రభుత్వం మాత్రం ఈ చట్టం వల్ల ప్రస్తుతం ఎవరికీ చెల్లిస్తున్న పెన్షన్‌ను తగ్గించడం లేదని, ఇప్పటికే ఉన్న సివిల్ లేదా రక్షణ పెన్షన్లను ఇది నేరుగా మార్చడం లేదని పార్లమెంటులో స్పష్టం చేసింది. 2026లో రాజ్యసభలో ఇచ్చిన సమాధానంలో కూడా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇదే విషయాన్ని పేర్కొంది. అదే సమయంలో, పెన్షన్ సవరణలు సాధారణంగా కేంద్ర వేతన సంఘాల ఆమోదిత సిఫారసులను అమలు చేసే ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా జరుగుతాయని తెలిపింది.

అయితే పెన్షనర్ల అసలు ఆందోళన ఇక్కడే ఉంది. ఈ రోజు పెన్షన్ తగ్గుతుందా లేదా అన్నది ఒక్కటే ప్రశ్న కాదు; రేపటి పెన్షన్ సవరణకు ఎవరు అర్హులు, ఏ ఫార్ములా వర్తిస్తుంది అన్నదే అసలు ప్రశ్న. ఒకే హోదాలో, ఒకే విధమైన బాధ్యతలు నిర్వర్తించి, ఒకే విధమైన సర్వీస్ రికార్డుతో పనిచేసిన ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరు డిసెంబర్‌లో, మరొకరు జనవరిలో పదవీ విరమణ చేశారనే కారణంతో భవిష్యత్తులో వేర్వేరు పెన్షన్ సవరణలు వస్తే అది తీవ్ర అసమానతకు దారితీయవచ్చని పెన్షనర్ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ భయానికి మరో కారణం ఎనిమిదో కేంద్ర వేతన సంఘం నిబంధనలు. 2025 నవంబర్ 3న ప్రకటించిన ఎనిమిదో వేతన సంఘానికి వేతనాలు, అలవెన్సులతో పాటు పెన్షన్, రిటైర్మెంట్ ప్రయోజనాలపై సిఫారసులు చేసే బాధ్యత ఉంది. అయితే గత కొన్ని వేతన సంఘాల నిబంధనల్లో కనిపించిన "ఇప్పటికే పదవీ విరమణ చేసినవారి పెన్షన్ సవరణ"పై స్పష్టమైన భాష ఈసారి లేకపోవడం పెన్షనర్ సంఘాల ఆందోళనకు కారణమైంది. అధికారికంగా ఎనిమిదో వేతన సంఘానికి



పెన్షన్‌పై సిఫారసులు చేసే అధికారం ఉన్నప్పటికీ, ప్రీ–2026 పెన్షనర్లందరికీ సవరణ తప్పనిసరిగా వర్తిస్తుందని ఇప్పటివరకు స్పష్టమైన హామీ లేదు.

ఈ విషయంలో సుప్రీంకోర్టు పాత తీర్పులను విస్మరించలేం. 1982లోని డి. ఎస్. నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో కోర్టు పెన్షనర్లను ఒక సమూహంగా పరిగణించి, కేవలం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా ఒకే తరహా పెన్షన్ సవరణ ప్రయోజనాన్ని కొందరికి ఇచ్చి మరికొందరికి నిరాకరించడం ఆర్టికల్ 14 సమానత్వ సూత్రానికి విరుద్ధమని పేర్కొంది.

తర్వాతి తీర్పుల్లో కూడా ఈ న్యాయ సూత్రానికి ప్రాధాన్యం కనిపించింది. 2023లో సుప్రీంకోర్టు ఒక కేసులో డి.ఎస్. నకారా తీర్పును వర్తింపజేస్తూ, రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షన్ సవరణలో భేదం చూపలేమని స్పష్టం చేసింది. అయితే అదే సమయంలో కోర్టు తీర్పులు ప్రతి సందర్భంలోని నిబంధనలు, ప్రయోజనం, వర్గీకరణకు ఉన్న తార్కిక ఆధారం వంటి అంశాలను పరిశీలిస్తాయి. అందువల్ల "ప్రతి రిటైర్మెంట్ తేదీ ఆధారిత వర్గీకరణ స్వయంచాలకంగా రాజ్యాంగ విరుద్ధమే" అని సరళీకరించడం కంటే, కొత్త చట్టం రాజ్యాంగ సమానత్వ సూత్రాలతో ఎలా సరిపోతుందో న్యాయస్థానమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఇక్కడే ప్రభుత్వానికి ఒక కీలక బాధ్యత ఉంది. పార్లమెంటు చట్టం చేసినంత మాత్రాన రాజ్యాంగ హక్కులపై చర్చ ముగిసిపోదు. శాసనం కూడా రాజ్యాంగానికి లోబడి ఉంటుంది. ఒక చట్టం గతంలో కోర్టు గుర్తించిన హక్కులకు భిన్నమైన వ్యవస్థను తీసుకురావాలంటే, దానికి స్పష్టమైన చట్టపరమైన ఆధారం, తార్కికమైన వర్గీకరణ, సమానత్వ సూత్రాలకు అనుగుణమైన ప్రయోజనం ఉండాలి. "వేతన సంఘం సిఫారసులను అమలు చేయడానికి ప్రభుత్వం భేదం చూపవచ్చు" అనే సాధారణ అధికారం భవిష్యత్తులో ఎలాంటి భేదానికైనా స్వయంచాలక అనుమతి ఇచ్చినట్టుగా భావించడం సరైంది కాదు.

పెన్షనర్ల ఆందోళనను ఈ నేపథ్యంలో గౌరవంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. దేశంలోని కోట్లాది వృద్ధుల జీవనంలో పెన్షన్ కేవలం నెలవారీ ఆదాయం కాదు. మందులు, వైద్యం, ఇంటి అద్దె, ఆహారం, విద్యుత్ బిల్లులు, కుటుంబ అవసరాలు అన్నీ దానిపైనే ఆధారపడి ఉండే సందర్భాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం సుమారు 69 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారు. అందువల్ల పెన్షన్ విధానంలో చిన్న మార్పు కూడా విస్తృతమైన సామాజిక ప్రభావాన్ని కలిగిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి కొంత భిన్నం. వారికి ఆయా రాష్ట్రాల పెన్షన్ నిబంధనలు వర్తిస్తాయి. అయినప్పటికీ కేంద్ర వేతన సంఘాల విధానాలు అనేక రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటాయి. కాబట్టి కేంద్ర స్థాయిలో రిటైర్మెంట్ తేదీ ఆధారిత వర్గీకరణ ఒక సాధారణ విధానంగా మారితే, భవిష్యత్తులో దాని ప్రభావం ఇతర ప్రభుత్వ రంగాలపైనా చర్చకు రావచ్చు. అయితే ప్రతి రాష్ట్రంలో చట్టపరమైన పరిస్థితి ఒకేలా ఉండదనే విషయాన్ని కూడా గుర్తించాలి.

ప్రస్తుతం అవసరమైనది ఆందోళనలను అణచివేయడం కాదు; స్పష్టత ఇవ్వడం. ఎనిమిదో వేతన సంఘం పరిధిలో 2026 జనవరి 1కు ముందు పదవీ విరమణ చేసిన పెన్షనర్లందరి పెన్షన్ సవరణపై స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఏ తేదీకి ముందు, ఏ తేదీ

> ఉద్యోగ జీవితంలో మూడు దశాబ్దాలు, నాలుగు దశాబ్దాలు ప్రభుత్వానికి సేవ చేసిన వ్యక్తికి పదవీ విరమణతో సేవ ముగుస్తుంది కానీ ప్రభుత్వంతో అతని సంబంధం ముగియదు. అతను పొందే పెన్షన్ గతంలో చేసిన సేవకు వాయిదా వేసిన ప్రతిఫలం. అందుకే పెన్షన్‌ను ప్రభుత్వ దయగా కాకుండా ఉద్యోగి సంపాదించుకున్న హక్కుగా చూడాలనే భావన భారత న్యాయవ్యవస్థలో బలంగా స్థిరపడింది. అలాంటి హక్కుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2025 ఆర్థిక చట్టం ద్వారా తీసుకొచ్చిన కొత్త నిబంధనలు ఇప్పుడు లక్షలాది పెన్షనర్లలో ఆందోళన కలిగిస్తున్నాయి.

తర్వాత అనే కృత్రిమ విభజన వల్ల ఒకే హోదాలో పనిచేసిన వృద్ధ ఉద్యోగుల మధ్య అన్యాయం జరగకుండా స్పష్టమైన సూత్రాన్ని ప్రకటించాలి. అవసరమైతే ఎనిమిదో వేతన సంఘం నిబంధనలను సవరించి, గత పెన్షనర్ల పెన్షన్ సవరణను స్పష్టంగా దాని పరిధిలో చేర్చాలి. పెన్షనర్ సంఘాలు కూడా న్యాయపరమైన మార్గాలతో పాటు వాస్తవ గణాంకాలు, ఆర్థిక ప్రభావ అధ్యయనాలు, ప్రత్యామ్నాయ సవరణ నమూనాలతో తమ వాదనను బలపరచాలి.

సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవ చేసినవారికి పదవీ విరమణ తర్వాత "మీరు ఏ తేదీన రిటైర్ అయ్యారు?" అనే ప్రశ్నకంటే "మీరు ఏ సేవ చేశారు?" అన్నదే ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యానికి మరింత తగిన ప్రశ్న. పెన్షన్ అనేది గత సేవకు భవిష్యత్తులో చెల్లించే సామాజిక భద్రత. అందుకే వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం జీవితాంతం పనిచేసిన వారి హక్కుల విషయంలో ప్రభుత్వం మరింత ఉదారంగా, పారదర్శకంగా, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా వ్యవహరించాలి. పెన్షనర్లలో నెలకొన్న అనిశ్చితిని తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం రిటైర్మెంట్ తేదీ ఆధారంగా అన్యాయమైన భేదాలకు అవకాశం లేకుండా చట్టాన్ని పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేయడం సముచితమైన మార్గం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.